ప్రమాదపుటంచున సెట్విస్ భవనం

- శిథిల భవనంలోనే వ్యాపారాలు
- కూలేందుకు సిద్ధంగా పై అంతస్తు
- స్థానికుల్లో ఆందోళన


భవనం పై అంతస్తు ఇలా..


68వ వార్డు రాంనగర్‌లో శిథిలావస్థలో ఉన్న సెట్విస్ భవనం

అక్కిరెడ్డిపాలెం: భెల్ సిగ్నల్ పాయింట్ సమీపంలో, జాతీయ రహదారి పక్కన ఉన్న శిథిల భవనం స్థానికులను కలవరపెడుతోంది. తెరిపిలేని వర్షాలతో ఏ క్షణం ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు.

40 సంవత్సరాల క్రితం అక్కిరెడ్డిపాలెం గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో 68వ వార్డు రాంనగర్‌లో సుమారు వెయ్యి గజాల విస్తీర్ణంలో 17షాపులుగా నిర్మించి ఎస్సీ డెవలప్‌మెంట్ అండ్ ఎడ్యుకేషన్ ట్రెనింగ్ ఎంప్లాయిమెంట్ ద్వారా ఉపాధి కల్పనకు అర్హులైన ఎస్సీలకు షాపులను కేటాయించారు. ప్రస్తుతం ఈ భవనం ప్రమాదకరంగా మారి శిథిలావస్థకు చేరింది. పై అంతస్తు పూర్తిగా కూలిపోయే పరిస్థితిలో ఉంది. ఈ భవనంలో షాపుల నిర్వాహకులందరూ ఇప్పుడు బినామీలేనని విమర్శలున్నాయి. గతంలో ఎస్సీలకు కేటాయించిన పరిస్థితులు వేరు.. ఇప్పుడు బినామీల చేతుల్లోకి వెళ్లిన తర్వాత లక్షల్లో అడ్వాన్సులు, వేలల్లో అద్దెలు వసూలు చేస్తూ దర్జాగా వ్యాపారాలు సాగిస్తున్నారని ఆరోపణలున్నాయి. వాటర్ ప్లాంట్, రెస్టారెంట్, చికెన్ షాపు, కార్ల రిపేర్, వాటర్ సర్వీసింగ్ తదితర వ్యాపారాలను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారు.

అధికారుల తీరుపై విమర్శలు

భవనం శిథిల స్థితిలో ఉన్నా, ప్రమాదం జరిగితే ప్రాణనష్టం జరిగే పరిస్థితి ఉన్నా సెట్విస్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని, ప్రతీ నెలా అద్దె చెల్లిస్తే చాలన్నట్లు వారి తీరు ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.

భవనంలోని 17 షాపుల్లో నిర్వాహకులు, సిబ్బంది సుమారు 40 మందికి పైగా ఉంటారని, వారు కాక వినియోగదారులు కూడా పెద్దసంఖ్యలో వస్తుంటారని తెలిపారు. వర్షాలకు నాని, భవనం కూలితే పెద్దసంఖ్యలో నష్టం జరిగే అవకాశం ఉందని స్థానికులు తెలియజేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదం జరగకముందే మేల్కోవాలి

కాలం చెల్లిన సెట్విస్ భవనాన్ని బినామీలు పూర్తిగా హస్తగతం చేసుకున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకున్నా, ప్రాణాల మీదకు వస్తుందనే భయం లేకుండా వ్యాపారులు షాపుల్లోనే ఉంటున్నారు. వర్షాకాలంలో ఈ శిథిల భవనం పూర్తిగా నాని కూలిపోయే ప్రమాదం ఉంది. ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు దృష్టి సారించాలి.

– వై.వి.రావు, గాజువాక

అధికారులు దృష్టి సారించాలి

రాంనగర్‌లో ఉన్న సెట్విస్ భవనం శిథిలావస్థలో ఉంది. ఈ భవనంలో వ్యాపారాలు జరుగుతుండడంతో జనం పదుల సంఖ్యలో ఉంటున్నారు. తుపాను సమయాల్లో అటు పక్కగా వెళ్లాలంటేనే మాకు భయంగా ఉంటుంది, మరి ఆ భవనంలో ఉంటున్నవారు ఎలా ఉంటున్నారో అనిపిస్తుంది. ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– రామారావు, ప్రైవేట్ ఉద్యోగి, ఆటోనగర్

క్లుప్తంగా

శాకంబరిగా విజయ దుర్గాదేవి


ప్రత్యేక అలంకరణలో విజయ దుర్గాదేవి

పెదగంట్యాడ: ఆషాడమాసం సందర్భంగా జీవీఎంసీ 75వ వార్డు పరిధి కండిపిల్లి వారి వీధిలో కొలువుదీరిన విజయ దుర్గాదేవి శుక్రవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కుక్కల ఏరివేత


రాజీవ్‌నగర్ ఫేజ్–1లో కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్ నగర్ ఫేజ్–1లో ఆరేళ్ల బాలుడిపై కుక్కలు దాడి చేయడంతో, జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ కుక్కల ఏరివేత చేపట్టింది. వుడా ఫేజ్–1లో బాలుడు సైకిల్‌పై వెళ్తుండగా కుక్కలు దాడిచేసి గాయపర్చిన విషయం విదితమే. దీంతో వుడానగర్ ఫేజ్–1 అసోసియేషన్ ప్రతినిధులు జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రజారోగ్యశాఖ అధికారులు నలుగురు సిబ్బందితో కుక్కల వ్యాన్ తీసుకువచ్చి కుక్కలను పట్టుకున్నారు.

దత్తత విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ


విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్న న్యూపోర్టు సీఐ దాలిబాబు

పెదగంట్యాడ: బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ ద్వారా అమెరికాకు చెందిన షేక్ చాంద్ పాషా చేస్తున్న సేవలు అభినందనీయమని న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సీఐ దాలిబాబు అన్నారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 20 మంది విద్యార్థులను పాషా దత్తత తీసుకున్న విషయం తెలిసిందే. ప్రతి నెలా వారికి అవసరమైన నిత్యావసర సరకులతో పాటు విద్యా సామగ్రి అందజేస్తున్నారు. అందులో భాగంగా ఈ నెలకు సంబంధించి రూ.18వేల విలువైన విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్, అప్పలరాజు, గౌరి, విజయలక్ష్మి, మాధవి, కిరణ్, సురేష్, సుకేసిని తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారు తనిఖీ


రైతులతో మాట్లాడుతున్న యాసిన్

పెదగంట్యాడ: స్థానిక రైతు బజార్‌ను జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ అధికారి యాసిన్ శుక్రవారం తనిఖీ చేశారు. రైతు బజారులో విక్రయిస్తున్న కంది పప్పు, బియ్యం విక్రయాలపై ఆరా తీశారు. అలాగే రైతు బజారులోని సమస్యలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలుదారులకు నాణ్యమైన సరకులు విక్రయించాలని రైతులకు సూచించారు.

సాంకేతిక నైపుణ్యాలపై అవగాహన అవసరం


అక్కిరెడ్డిపాలెం హైస్కూల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయిని


మింది హైస్కూల్లో ఐఎఫ్‌పీ బోర్డుపై పాఠ్యాంశాలను వివరిస్తున్న ఉపాధ్యాయుడు

అక్కిరెడ్డిపాలెం: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం, మింది జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో శుక్రవారం సాంకేతిక నైపుణ్యాల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఐఎఫ్‌పీ బోర్డుల్లో పాఠ్యాంశాలను వివరించారు. ప్యానల్ బోర్డు పనితీరును తెలియజేశారు. విద్యార్థులకు కంప్యూటర్ల వినియోగం, వాటి టెక్నాలజీ, భవిష్యత్తులో ఉపయోగం తదితర అంశాలను వివరించారు. ట్యాబ్‌ల ఉపయోగాలు, ట్యాబ్‌ల్లో పాఠ్యాంశాల వివరణ, ఎలా వినియోగించాలి అనే అంశాలను విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కుమారస్వామి, మింది జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పి.వి.ఎ స్.ఎస్.ఆంజనేయ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంప్రదాయ క్రీడల సందడి


ఇస్లాంపేట పాఠశాలలో అష్టాచమ్మా ఆడుతున్న బాలికలు

పెదగంట్యాడ: ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఇస్లాంపేట, గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులతో పూర్వీకులు ఆడుకున్న బచ్చాలాట, అష్టాచమ్మా ఆటలు ఆడించారు. ఈ సందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయినులు ప్రమీల, మాలతి మాట్లాడుతూ పూర్వకాలంలో ఆడే సంప్రదాయ ఆటలు కనుమరుగవుతున్నాయన్నారు. వాటి పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి, ఆ ఆటలను ఆడేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులకు చెక్


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఏఎంహెచ్‌వో కిరణ్ కుమార్

అక్కిరెడ్డిపాలెం: చికిత్స కంటే నివారణే ఉత్తమ మార్గం అని గాజువాక జోన్ ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. అప్రమత్తంగా ఉంటూ, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులకు చెక్ చెప్పవచ్చన్నారు. 72వ వార్డు చినగంట్యాడలో శుక్రవారం నిర్వహించిన సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు సోకుతాయన్నారు. కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ మాట్లాడుతూ దోమల నివారణ కోసం జీవీఎంసీ సహకారం ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో యూసీడీ అధికారి సూర్యనారాయణ, శానిటరీ, మలేరియా ఇన్స్‌స్పెక్టర్లు ఈశ్వరరావు, శ్రీనివాస్, ఆర్పీ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అమ్మతో కలిసి మొక్కలు నాటాలి

- ఏపీఎస్‌జీసీ అనకాపల్లి జిల్లా కో–ఆర్డినేటర్ ఖగేశ్వరరావు

అగనంపూడి: ఎకో క్లబ్‌ల ద్వారా పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సమతుల్యతకు పాటుపడాలని ఏపీఎస్‌జీసీ అనకాపల్లి జిల్లా కో–ఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు అన్నారు. లంకెలపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఆరో రోజు శనివారం పాఠశాల స్థాయిలో ఎకో క్లబ్‌ల ఏర్పాటు, వాటి ద్వారా మొక్కలు నాటడం, కిచెన్ గార్డెన్‌ను తయారు చేయడం చేయాలన్నారు. విద్యార్థుల తల్లులతో పాఠశాల ఆవరణల్లో మొక్కలు నాటడం, విద్యార్థులకు అవగాహన కల్పించడం, వారి తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అమ్మ పేరుతో అమ్మతో కలిసి మొక్కలు నాటి అమ్మకి అంకితం చేసే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో పోషణ దినోత్సవం (న్యూట్రిషన్ డే) చేపట్టాలని కోరారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద పనిచేసే ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొనేలా ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు సహకరించాలని కోరారు.

పోర్టు కార్మికుల దీక్షలకు భెల్ సిటూ మద్దతు


దీక్షలో మాట్లాడుతున్న భెల్ సిటూ ప్రధాన కార్యదర్శి ప్రకాష్

అక్కిరెడ్డిపాలెం: పోర్టుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోర్టు కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు భెల్ (హెచ్‌పీవీపీ) సిటూ నాయకులు సంఘీభావం తెలిపారు. సీహార్స్ జంక్షన్‌లో చేపట్టిన దీక్షల్లో భెల్ సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ ఇప్పటికే ఐదు బెర్తులను ప్రైవేటువారికి అప్పజెప్పారని, మిగతా వాటిని కూడా ప్రైవేటీకరణ చేసే దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. పోర్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భెల్ సిటూ పూర్తి స్థాయి మద్దతు తెలుపుతుందన్నారు. కార్మికులకు వేతన ఒప్పందం అమలు చేయాలని డిమండ్ చేశారు. కార్యక్రమంలో సిటూ నాయకులు జి.అచ్చంనాయుడు, కె.నారపురెడ్డి, పి.కనకారావు, ఎస్.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

పందుల స్వైర విహారం


నడుపూరు గెడ్డ పక్కన ప్రధాన రహదారిలో పందుల గుంపు

పెదగంట్యాడ: మండలంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లపై గుంపులుగా సంచరిస్తూ, అటుగా రాకపోకలు సాగించే వారిపై దాడులకు దిగుతున్నాయి. వాహనచోదకులకు అడ్డంగా రావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరు, బర్మా కాలనీ, డెయిరీ కాలనీ, రామచంద్రనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, స్వతంత్రనగర్, తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండిపోవడంతో అందులోనే సేద దీరుతూ, దానిని చిందరవందర చేయడంతో పాటు వాటిల్లో అవి దెబ్బలాడుకుంటూ అటుగా వెళ్లే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. నిత్యం ఈ ప్రాంతంలోని స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ సమయంలో పందులు అక్కడే సంచరిస్తూ వాహనాలకు అడ్డుపడుతున్నాయి. అధికారులు స్పందించి, పందుల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

‘ప్రశ్నించేవారు లేకుంటే పాలకులదే ఇష్టారాజ్యం’

అక్కిరెడ్డిపాలెం: ప్రశ్నించేవారు లేకపోతే శాసించే పాలకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తారని సీఐటీయూ నాయకులు అన్నారు. అన్యాయాన్ని ప్రశ్నించాలని, హక్కులను పోరాడైనా సాధించుకోవాలని పిలుపునిచ్చారు. జీవీఎంసీ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాజకీయ చైతన్య అవగాహన తరగతులు నిర్వహించారు. చినగంట్యాడ సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టేలా పోరాటం చేస్తున్న సీపీఎం, సీఐటీయూ కృషి, విధానాలను వివరించారు. 64 నుంచి 76 వార్డుల వరకు, 85 నుంచి 88వ వార్డుల పారిశుధ్య కార్మికుల్లో చురుకైన కార్మికులకు ఈ తరగతులు నిర్వహించారు. గాజువాక 32 గ్రామ పంచాయతీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై నాయకులు రాజేంద్ర ప్రసాద్, పి.వి.రెడ్డి, ఉరుకూటి రాజు, ఎం. రాంబాబు మాట్లాడారు. కార్యక్రమంలో సిటూ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో స్నేహభావంతో మెలగాలి

- సీపీ శంఖబ్రత బాగ్చి
- న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సందర్శన


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

పెదగంట్యాడ: ఫిర్యాదుదారుల పట్ల స్నేహభావంతో మెలగాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సిబ్బందికి సూచించారు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. స్టేషన్ అధికారులు, సిబ్బంది ఫిర్యాదుదారులతో ప్రవర్తిస్తున్న తీరును పరిశీలించారు. స్టేషన్‌ను ఆనుకుని ఉన్న ఖాళీ ప్రాంతాలను వ్యర్థాలతో నింపకుండా శుభ్రం చేయించి, మొక్కలు నాటాలని ఆదేశించారు. స్టేషన్ లోపల అన్ని ప్రాంతాలు పరిశీలించారు. స్టేషన్‌తో పాటు మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సూచించారు. స్టేషన్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పెండింగ్ కేసులు తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో మాట్లాడారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను పారదర్శకంగా విచారణ చేసి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సిబ్బంది విద్యార్హతలు తెలుసుకుని, వారి పనితీరుపై ఆరా తీశారు. వారికి పలు సూచనలు చేశారు. స్టేషన్ ఆవరణలో ఉన్న సీజ్ చేసిన వాహనాలు పాడవకుండా చర్యలు చేపట్టాలన్నారు. క్రైం ప్రివెన్షన్, డిటెక్షన్, ప్రాసిక్యూషన్‌కు ఎంతో ఉపయోగపడే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. గంజాయి రవాణా చేసిన, నిల్వ చేసిన వారిని గుర్తించి అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. విధుల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

సరిహద్దుల్లో సైనికుల సేవలు ఎనలేనివి

- దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు
- ఘనంగా కార్గిల్ విజయ దివస్
- మాజీ సైనికోద్యోగులకు సత్కారం


మాజీ సైనికోద్యోగులను సత్కరిస్తున్న సీఐ


కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న శ్రీనివాసరావు, సురేష్ కుమార్‌లను సన్మానిస్తున్న రవికుమార్

అగనంపూడి: దేశ ప్రజలను, సరిహద్దులను త్రివిధ దళాలు రక్షక వలయంగా కాపాడుతున్నాయని దువ్వాడ సీఐ వావిలపల్లి ఎర్రంనాయుడు అన్నారు. కార్గిల్ విజయ దివస్ సిల్వర్ జూబ్లీని పురస్కరించుకుని అగనంపూడి సీడబ్ల్యూసీలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ అంతర్భాగంలో ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారంటే దానికి కారణం సరిహద్దుల్లో ఉండి రక్షిస్తున్న సైనికులే అన్నారు. ఎండకు, వానకు వెరవక, ప్రాణాలను పణంగా పెట్టి కాపలా కాస్తున్న వారి సేవలు ఎనలేనివన్నారు. కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన అమరయోధులకు దేశం ఘన నివాళులర్పిస్తోందన్నారు. కార్గిల్ యుద్ధంలో విజయం సాధించి భారతదేశ సత్తాను ప్రపంచ నలుదిశలా వ్యాపింపజేసిన సైనిక యోధులకు వందనాలన్నారు. ఈ సందర్భంగా మాజీ సైనికోద్యోగులను ఘనంగా సత్కరించారు. ఆశా షైనింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా ఉత్తరాంధ్ర జోన్ ఇన్‌చార్జి కట్ట పద్మ, ఆశా షైనింగ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పులగపురి ఆశాలత, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, జేసీఐ జోన్ ఇన్‌చార్జి ఎస్.ప్రవీణ్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కార్గిల్ యుద్ధ వీరులకు సన్మానం

అక్కిరెడ్డిపాలెం: కార్గిల్ విజయోత్సవాన్ని 70వ వార్డు శ్రీ సాయి విద్యానికేతన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులు ఇద్దరిని ఘనంగా సత్కరించారు. వారిలో వాయు సేనలో మూడు పతకాలు సాధించిన ఎస్.శ్రీనివాసరావుతో పాటు నేవీలో సోనార్ చీఫ్ ఎస్.సురేష్ కుమార్ ఉన్నారు. వారిని సాయి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ ఎస్.రవికుమార్ శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, సురేష్ కుమార్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో సైనికుల త్యాగాలను వివరించి, విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. కార్గిల్ యుద్ధంలో కొన్ని ఘట్టాలను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ‘ఉక్కు’ను కాపాడుకుందాం


మాట్లాడుతున్న మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్

అగనంపూడి: విశాఖ ఉక్కు పరిరక్షణకు అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లడం మంచిదని మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో 1261వ రోజు, శుక్రవారం ఉక్కు ఇంటక్ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ఒక్కటే శరణ్యమని, అలాగే తక్షణ సాయంగా విశాఖ ఉక్కుకు రూ.పదివేల కోట్లు అందివ్వాలని డిమాండ్ చేశారు. మూడున్నర ఏళ్ల నుంచి ఉద్యమం కొనసాగుతున్నా లెక్క చేయకపోవడం రాష్ట్ర ప్రజలను అవమానించడమే అవుతుందన్నారు. తెలుగు ప్రజల సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న స్టీల్‌ప్లాంట్‌తో వ్యాపారం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఉక్కు ఇంటక్ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, ఏఐటీయూసీ కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలనే ఆలోచన రావడం దుర్మార్గమని, దానికి అనుగుణంగా అడుగులు వేయడం దేశ ద్రోహం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, బీఎన్ రాజు, జి.వి.సుబ్బయ్య, కారు రమణ, కొవిరి అవతారం, పి.వి.రమణమూర్తి, పోతారెడ్డి, హరనాథ్, గంగవరం గోపీ, త్రిమూర్తులు, వేణు వర్మ, ఎస్.ఎ.నాయుడు,గోవిందరావు, గోపాలరాజు, ఆర్.జగదీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు సమస్యలపై ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా చైర్మన్ ప్రాన్ మాట్లాడుతూ అనేక సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇంత వరకూ పరిష్కారం చేయలేదని దుయ్యబట్టారు. కూర్మన్నపాలెం డిపోకు చెందిన కండక్టర్‌పై దౌర్జన్యం చేయడం సహించ రానిదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా కేసులు పెట్టడం మానుకోవాలని నినదించారు. డిపో అధ్యక్షుడు బి.ఎ.నాయుడు, కార్యదర్శి జేఎస్‌ఈఎన్ రాజు, అచ్చిబాబు, ఉపాధ్యక్షుడు ఆర్‌డీ నాయుడు, ప్రచార కార్యదర్శి సీహెచ్‌ఎస్. వాసు తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే అడుగు వేయలేం..


చిత్తడిగా మారిన పెదగంట్యాడ రైతుబజార్

పెదగంట్యాడ: స్థానిక రైతుబజార్ వద్ద చినుకు పడితే చాలు కాలు తీసి కాలు పెట్టలేని పరిస్థితి ఉంటోంది. రైతుబజార్ ఆవరణ అంతా బురదమయంగా మారడంతో వినియోగదారుల, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. గత ఆరు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతు బజారులో నీరు నిల్వ ఉండడంతో ఓ వైపు దుర్గంధం భరించలేకపోగా, మరో వైపు బురదతో కాలు తీసి కాలు పెట్టలేని పరిస్థితి ఉంటోంది. దీంతో వర్షం వస్తే రైతుబజార్‌కు వద్దులే అన్న అభిప్రాయానికి వస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, వర్షం పడితే నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలి



మహాసభలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న పిలుపునిచ్చారు. ఉక్కునగరంలో శుక్రవారం నిర్వహించిన కేవీపీఎస్ 7వ మహాసభలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని దేశ ప్రజలందరూ అంబేడ్కర్ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. దేశ అధికారం కొంత మంది చేతుల్లో ఉందని, బడుగు, బలహీన వర్గాల చేతిలో ఉన్నప్పుడే నిజమైన రాజ్యాంగ స్ఫూర్తి అన్నారు. ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యు. శ్రీనివాసరావు మాట్లాడుతూ బహుజనులందరూ ఏకమైతే నిజమైన రాజ్యాంగ ఫలం దక్కుతుందన్నారు. కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకోవడంతో పాటు హక్కులు కాపాడుకోవడానికి అందరూ పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఎం.కృష్ణారావు, వి.ప్రకాశ వరకుమార్, టి.చిరంజీవి, వై.టి. దాస్, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.